క్లుప్తంగా

నిలిచిన పత్తి కొనుగోళ్లు

చిట్యాల: మండలంలోని శాంతినగర్ శివారు లోగల అంజనేయ ఇండస్ట్రీస్, గ్రోసూరుపల్లి శివారులోని మురగాన్ కాటన్ మిల్లులో సీసీఐ పత్తి కొనుగోళ్లు రెండు రోజుల నుండి నిలిచిపోయినట్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి కనకశేఖర్ తెలిపారు. సీసీఐ పత్తి కొనుగోలులో ఆధార్ సర్వర్ పని చేయకపోవడంతో సోమవారం నుంచి పత్తి కొనుగోళ్లు నిలిచిపోయినట్లు పేర్కొన్నారు. కావున పత్తి రైతులు పత్తిని సీసీఐ కొనుగోలు సెంటర్‌లకు తీసుకరావద్దని కోరారు. మళ్లీ ప్రకటించేంత వరకు రైతులు వేచి ఉండాలని తెలిపారు.

నిబంధనలు పాటించకుండా విధులు

భూపాలపల్లి అర్బన్: జిల్లాలో సినియారిటీ నిబంధనలు పాటించకుండా పంచాయతీ ఎన్నికల విధులు కేటాయించారని డీటీఎఫ్, టీపీటీఎఫ్ సంఘాల నాయకులు మంగళవారం సీపీఓ బాబురావుకు వినతిపత్రం అందజేశారు. ఆర్ఓ, ఏఆర్ఓ విధుల్లో సినియారిటీలకు కేటాయించాలని, పారదర్శకత పాటించాలని సూచించారు. ఆరు నెలలలోపు పదవీ విరమణ పొందే ఉపాధ్యాయులు, వికలాంగ, ప్రత్యేక అవసరాల గల ఉపాధ్యాయులకు ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని వినతిలో కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల జిల్లా నాయకులు రమణారెడ్డి, తిరుపతి, సేవానాయక్, జగపతిరావులు పాల్గొన్నారు.

13 నుంచి క్రికెట్ టోర్నమెంట్

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో బందెల రాజేశ్వరీ స్మారక క్రికెట్ టోర్నమెంట్‌ను మాజీ ఎంపీటీసీ రెవెల్లి మమతనాగరాజుల ఆధ్వర్యంలో ఈనెల 13 నుంచి ప్రారంభిస్తున్నట్లు నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాళేశ్వరం, అన్నారం ఎంపీటీసీ స్థానాల పరిధిలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 12లోగా టీం పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలకు బందెల బన్ని 7780593127, శ్రీరాముల అంజీ 9618885483, లేతకరి ప్రవీణ్ 8374204166 నంబర్‌లలో సంప్రదించాలన్నారు.

బహుమతుల ప్రదానం


ములుగు రూరల్: అఖిల భారత విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఖేలో భారత్ క్రీడోత్సవాల ముగింపు కార్యక్రమం మంగళవారం జిల్లాకేంద్రంలో నిర్వహించారు. ఈ మేరకు ఏబీవీపీ జిల్లా కన్వీనర్ మమస్‌యాదవ్ ఆధ్వర్యంలో కబడ్డీ, ఖో–ఖో, వాలీబాల్ క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంస పత్రాలు, బహుమతులు అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాయిరాం, శ్రీనాథ్, బంటి, క్రీడాకారులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకు వాహనాలు నడపాలి



ములుగు: రోడ్డు రవాణా నిబంధనల మేరకు ప్రతిఒక్కరూ వాహనాలు నడపాలని ఆర్టీఓ బరగడి శ్రీనివాస్ సూచించారు. ఈ మేరకు మల్లంపల్లి మండలంలోని సమ్మక్క–సారలమ్మల టిప్పర్ లారీ అసోసియేషన్ అధ్యక్షుడు స్వతంత్రం ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని రవాణాశాఖ కార్యాలయంలో ఆర్టీఓ శ్రీనివాస్‌కు పుష్పగుచ్ఛం అందించి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆర్టీఓ మాట్లాడుతూ వాహనాల ఓనర్లు, డ్రైవర్లు ఎదుటివారి క్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని డ్రైవింగ్ చేయాలన్నారు. అతివేగంతో వాహనాలను నడిపి ఇతరుల ప్రాణాలకు హాని కలిగించవద్దన్నారు. అసోసియేషన్ సభ్యులు ఐక్యంగా ఉండి ఎలాంటి తప్పిదాలకు తావు ఇవ్వకుండా నడుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సముద్రాల బాలరాజు, ఉపాధ్యక్షుడు సిద్ధార్థ, కోశాధికారి కూరాకుల రాజు, సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



సారయ్య (ఫైల్)

భూపాలపల్లి రూరల్: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందగా, మరొకరికి గాయాలయ్యాయి. ఈ ఘటన మంగళవారం భూపాలపల్లి మండలం వజినపల్లి గ్రామసమీపంలో జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. చిట్యాల మండలం కొత్తపేటకు చెందిన కొడారిసారయ్య (49)ను మల్హర్ మండలం నాచారం గ్రామానికి చెందిన పోలుసాని శ్రీనివాసరావు చెల్పూరులో బస్సు ఎక్కించడానికి బైక్‌పై నేరేడుపల్లి మీదుగా వెళ్తున్నాడు. ఈ క్రమంలో వజినపల్లి సమీపంలో బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కన చెట్టుకు ఢీకొంది. ఈఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలు కావడంతో గ్రామస్తులు ఆస్పత్రికి తరలిస్తుండగా సారయ్య మార్గమధ్యలో మృతి చెందాడు. శ్రీనివాసరావు హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

పల్లెలకు రాని ‘పల్లె వెలుగు’

- ఆర్టీసీ బస్సు సౌకర్యం లేని గ్రామాలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



టేకుమట్ల: రవాణా సౌకర్యం సరిగా లేక ఇప్పటికీ మండలంలోని ఎన్నో గ్రామాలు వెనకబడి ఉన్నాయి. పాలకులకు పట్టింపు లేకపోవడంతో అత్యవసర సమయంలో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని అంకుషాపూర్, సోమనపల్లి, సుబ్బక్కపల్లి, పెద్దంపల్లి, కలికోట, బోయినిపల్లి, జోడుపల్లి గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు. దీంతో వారు సొంత వాహనాలు, ప్రైవేటు వాహనాలపై ఆధారపడి ప్రయాణించాల్సి వస్తుంది. అధికార కార్యాలయాలకు, వ్యాపార, వ్యక్తిగత అవసరాల నిమిత్తం మండల కేంద్రానికి రావాలంటే చుక్కలు చూడాల్సిందే. ఇక మహిళలు, వృద్ధుల పరిస్థితి మరీ దారుణం. అంకుషాపూర్, సోమనపల్లి, సుబ్బక్కపల్లి గ్రామాల విద్యార్థులు ప్రతీ రోజు కాలి నడకన, సైకిళ్లపై మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలకు వెళ్లాల్సిందే. ఇక వర్షాకాలంలో వారి ఇబ్బందులు ఎనలేనివి. ఇదే అదునుగా భావిస్తున్న ప్రైవేటు వాహనదారులు అందిన కాడికి దండుకుంటూ వాహన చార్జీలు వసూలు చేస్తున్నారు.

టేకుమట్లకు రావడాని తప్పని తిప్పలు

మండలంలోని దుబ్యాల, మందలోరిపల్లి, వెల్లంపల్లి, గుమ్మడవెల్లి, కుందనపల్లి, బండపల్లి, ఎంపేడు గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి రావాలంటే ప్రైవేటు వాహనాలే దిక్కు. ఆయా గ్రామాలకు కరీంనగర్, జమ్మికుంట పట్టణం నుంచి బస్సులు వెళ్తుంటాయి. కానీ మండల కేంద్రానికి బస్సు సౌకర్యం లేకపోవడంతో టేకుమట్లకు రావాలంటే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మంత్రికి వినతి

మండలంలోని అన్ని గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ గత ఆదివారం రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్‌గౌడ్ హైదరాబాద్‌లో వినతి పత్రం అందించారు. అందుకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. మంత్రితో ఎమ్మెల్యే చేసిన మంతనాలు ఫలిస్తే మండల కేంద్రంతో అన్ని గ్రామాలకు రవాణా సౌకర్యం మెరుగు పడడంతో పాటు, ప్రతీ ఒక్కరికి రవాణా అందుబాటులోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి



సుబ్బక్కపల్లి, సోమనపల్లి, అంకుషాపూర్ గ్రామాల ప్రజలు నిత్యం మండల కేంద్రానికి వస్తూ, పోతుంటారు. గతంలో కొన్ని రోజులు మాత్రమే బస్సు సౌకర్యం ఉంది. ప్రస్తుతం రోడ్డు సౌకర్యం కూడా ఉండడంతో నూతనంగా బస్సు ట్రిప్పును కొనసాగించాలి. దీంతో పరకాలకు వెళ్లే ప్రయాణికులు దూర భారం తగ్గుతుంది. విద్యార్థులకు కూడా ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

– ఉద్దమారి మహేశ్ యాదవ్, మాజీ సర్పంచ్ సోమనపల్లి

ప్రైవేట్ వాహనాలే దిక్కు..



ఎంపేడు నుంచి మండల కేంద్రానికి అధికార కార్యాలయాలకు, వ్యక్తిగత పనులకు మండల కేంద్రానికి రావాలంటే బైక్ లేదా ప్రైవేట్ వాహనాలే దిక్కు. ఎంపేడు నుంచి జమ్మికుంటకు మాత్రమే బస్సు ఉండడంతో రవాణా సౌకర్యం లేకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో జమ్మికుంటకే వెళ్ళాల్సి వస్తుంది. నిత్యం మండల కేంద్రానికి గ్రామస్తులు వస్తుంటారు కావున, ఎంపేడు నుంచి టేకుమట్లకు ఆర్టీసి బస్సు సౌకర్యం కల్పించాలి.

– కొలిపాక రాజయ్య, మాజీ సర్పంచ్ ఎంపేడు

నాణ్యమైన వైద్యసేవలు అందించాలి



సిబ్బందికి సూచనలిస్తున్న బృందం సభ్యులు

కాటారం: గ్రామీణ పేద ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించడానికి వైద్యులు, సిబ్బంది కృషి చేయాలని ఎక్వాస్ వర్చువల్ నేషనల్ అశేషనర్స్ బృందం సభ్యులు డాక్టర్ స్వామి కపాడియా, డాక్టర్ శరణప్ప గంగిర్ సూచించారు. మండలంలోని చింతకాని సబ్‌సెంటర్‌లో నేషనల్ ఎక్వాస్ అసోసియేషన్ కార్యక్రమం నిర్వహించారు. సబ్‌సెంటర్‌ను పరిశీలించిన అశేషనర్స్ బృందం సభ్యులు వైద్యసేవలపై ఆరా తీశారు. గర్భావతులు, బాలింతలకు అందిస్తున్న సేవలు, పిల్లలకు నెల వారిగా వేస్తున్న టీకాలకు సంబంధించిన సేవలను గూర్చి అడిగి తెలుసుకున్నారు. రోగులపై సేవాభావంతో నడుచుకోవాలని సూచించారు. పేద ప్రజలకు నమ్మకం కల్గించేలా వైద్యసేవలు అందించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎం అండ్‌హెచ్ఓ డాక్టర్ రవిరాథోడ్, జిల్లా ప్రోగ్రామింగ్ అధికారులు డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ ఉమాదేవి, డాక్టర్ ప్రమోద్, మండల వైద్యాధికారిణి డాక్టర్ మౌనిక, జిల్లా ఎక్వాస్ ప్రోగ్రాం అధికారి చిరంజీవి, సిబ్బంది పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలి



మాట్లాడుతున్న సోనాజీ

పలిమెల: కుష్ఠు వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలని అంబటిపల్లి పీహెచ్‌సీ హెల్త్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ సోనాజీ విద్యార్థులకు సూచించారు. జాతీయ కుష్ఠు నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని పంకెనలోని కేజీబీవీలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సోనాజీ మాట్లాడుతూ.. కుష్ఠు వ్యాధి తుంపర్ల ద్వారా వస్తుందని వ్యాధిగ్రస్తుడు మాట్లాడినప్పుడు, తుమ్మినప్పుడు, దగ్గినప్పుడు ఆ తుంపర్ల ద్వారా ఇతరుకు వ్యాపించే అవకాశం ఉందన్నారు. వ్యాధి సోకినట్లయితే శరీరంపై రాగి వర్ణంలో మచ్చలు ఏర్పడతాయని వాటిని తాకినప్పుడు స్పర్శ ఉండదని, ఇలాంటి మచ్చలు ఉన్నట్లయితే తక్షణమే వైద్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. సరైన సమయంలో వైద్యులను సంప్రదిస్తే చికిత్స ద్వారా కుష్ఠును నయం చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సత్యనారాయణ, ఏఎన్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

పులి సంచారంపై అధికారుల ఆరా..

- కానరాని అడుగుజాడలు



అటవీప్రాంతంలో వాగు వద్ద పరిశీలిస్తున్న అధికారులు

కాటారం: మహదేవపూర్ రేంజ్ పరిధిలోని కాటారం మండలం నస్తూర్‌పల్లి అటవిప్రాంతంలో పులి సంచరిస్తుందనే సమాచారంతో మంగళవారం అటవీ శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. కాటారం రేంజ్ పరిధిలోని అడవిప్రాంతంలో పులి కదలికలపై ఆరా తీశారు. నస్తూర్‌పల్లి అటవీ ప్రాంతంలో ఎద్దు తప్పిపోవడంతో నస్తూర్‌పల్లికి చెందిన ఓ రైతు జాడ కోసం వెళ్లి వస్తుండగా పులిని గమనించినట్లు గ్రామస్తులకు తెలిపారు. దీంతో అధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని సమీపంలోని వాగువద్ద పులి పాదముద్రలు సేకరించారు. అడవిప్రాంతంలో పులి సంచరిస్తుందన్న ప్రచారం నిజమైంది. కాగా నస్తూర్‌పల్లి అటవిప్రాంతం నుంచి పులి కాటారం రేంజ్ పరిధిలోని అటవిప్రాంతానికి చేరుకునే అవకాశాలు ఉన్నాయని భావించిన కాటారం రేంజ్ అధికారులు విచారణ చేపట్టారు. ఆదివారంపేట, గుమ్మాళ్లపల్లి, ఒడిపిలవంచ, గూడూరు గ్రామాలకు సమీపంలోని అటవీ ప్రాంతాన్ని కాటారం రేంజ్ అధికారి స్వాతి ఆధ్వర్యంలో జల్లెడ పట్టారు. అడవిలో నీరు నిల్వ ఉండే వాగులు, వంకలు, ఇతరాత్ర ప్రదేశాల్లో పులి అడుగుజాడల కోసం క్షుణ్ణంగా పరిశీలన చేశారు. ఎక్కడ కూడా పులి ఆనవాళ్లు కానరాకపోవడంతో ఇటువైపుగా వచ్చి ఉండదని నిర్ధారణకు వచ్చారు. గత రెండేళ్ల క్రితం సైతం పులి నస్తూర్‌పల్లి అటవీ ప్రాంతం గుండా కాటారం అటవీ ప్రాంతంలోకి చేరుకొని ఒడిపిలవంచ సమీపంలో పశువుల కాపర్ల కంటపడింది. రెండు మూడు రోజుల పాటు ఇదే ప్రాంతంలో ఉండి పశువులను బలితీసుకుంది. ప్రస్తుతం కూడా పులి అదే తరహాలో ఇటువైపుగా వచ్చి ఉంటుందని అధికారులు భావించినప్పటికి ఆనవాళ్లు దొరకకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. పులికి సంబంధించి ఎలాంటి ఆనవాళ్లు లేవని ప్రజలు భయాందోళనలకు గురికావద్దని కానీ రాత్రి పూట అటవి ప్రాంతం లోపలికి వెళ్లవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్వో స్వాతితో పాటు కాటారం డిప్యూటీ రేంజర్ సురేందర్, పెగడపల్లి డిప్యూటీ రేంజర్ శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

కొండాయి జాతరకు సిద్ధం



దొడ్లలో ముస్తాబు అయిన సారలమ్మ గద్దె



నాగులమ్మ గుడి వద్ద పూజలు చేస్తున్న భక్తులు



నాగులమ్మకు పుట్టమన్ను తెస్తున్న పూజారులు

- నాగులమ్మకు పుట్టమన్నుతో అలంకరణ
- నేటి నుంచి జాతర ప్రారంభం

ఏటూరునాగారం: మండలంలోని కొండాయి గ్రామంలో నేడు(బుధవారం) నుంచి ప్రారంభం కానున్న జాతరకు ఏర్పాట్లను అధికారులు, పూజారులు సర్వం సిద్ధం చేశారు. కొండాయి గ్రామంలో కొలువై ఉన్న గోవిందరాజులు, నాగులమ్మ, దొడ్లలోని సారలమ్మ గుడులను ముస్తాబు చేశారు. మంగళవారం నాగులమ్మ గుడిని అడివిలోని పుట్టమన్నును ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాలతో డప్పుచప్పుళ్లతో తీసుకువచ్చి అలంకరించి ముగ్గులు వేశారు. నేటి నుంచి జాతరను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు పూజారులు దబ్బగట్ల జనార్ధన్, రాజారాం, గోవర్ధన్ తెలిపారు. అలాగే సారలమ్మ వద్ద గుడిని అలంకరించి నేడు గోవిందరాజుల గుడికి తీసుకపోవడం జరుగుతుందని సారలమ్మ పూజారి కాక వెంకటేశ్వర్లు తెలిపారు. నేడు దొడ్ల నుంచి సారలమ్మను గోవిందరాజుల గుడికి వచ్చిన తర్వాత నాగులమ్మ, గోవిందరాజుల పడిగకు పూజలు చేస్తారు. అనంతరం గ్రామ సమీపంలోని గద్దెల వద్దకు సారలమ్మను ప్రతిష్ఠిస్తారు. అనంతరం గురువారం గోవిందరాజులను, నాగులమ్మను దేవర గుట్ట నుంచి వడ్డెరకుండల్లో తీసుకువచ్చి గద్దెల వద్ద ప్రతిష్ఠిస్తారు. దీంతో జాతర మొదలవుతుంది. శుక్రవారం భక్తుల దర్శనాల అనంతరం శనివారం వనప్రవేశం జరుగుతుంది. భక్తుల కోసం ఐటీడీఏ ద్వారా చలువ పందిళ్లు, తాగునీటి వసతి, విద్యుత్ దీపాలను అలంకరించారు.



కొండాయిలో సిద్ధం చేసి ఉన్న గద్దెలు

ద్వారకపేటలో నేత్ర వైద్యశిబిరం



నేత్ర వైద్య శిబిరంలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు వెంకట్

టేకుమట్ల: మండలంలోని ద్వారకపేటలో ఆర్ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కత్తి సంపత్‌గౌడ్ సమక్షంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నేత్ర వైద్య శిబిరానికి వచ్చిన 120మందికి పరీక్షలు చేసి, 40 మందికి కంటి ఆపరేషన్ అవసరం ఉందని గుర్తించారు. అనంతరం లయన్స్ క్లబ్ జనరల్ సెక్రెటరీ, అప్తాల్మిక్ గుంటోజు వెంకన్న మాట్లాడుతూ.. కంటిలో పొరలు వచ్చిన వారికి హైదరాబాద్‌లోని పుష్పగిరి కంటి ఆస్పత్రిలో ఉచితంగా కంటి ఆపరేషన్ చేయించనున్నట్లు తెలిపారు. స్థానిక ఆర్ఎంపీ కత్తి సంపత్ కోరిక మేరకు గ్రామంలో ప్రతీ సంవత్సరం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

ఎన్డీఆర్ఎఫ్ టీం అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ బృందం

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం అన్నారంలో వరదలు, విపత్తులు, ఇతర అపాయాలు వస్తే ఎలా రక్షించుకోవాలి, ఎదుర్కోవాలి అనే అంశంపై ఎన్డీఆర్ఎఫ్ 10 బెటాలియన్ సభ్యులు ప్రజలకు మంగళవారం అవగాహన కల్పించారు. పలు సూచనలు, సలహాలు ఇచ్చి మాక్‌డ్రిల్ చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రహ్లాద్ రాథోడ్, కార్యదర్శులు మంజూరుద్దీన్, సమ్మయ్య, గీత తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

మంగపేట: మండలంలోని తిమ్మంపేటలో నేతకానివాడకు చెందిన గాందెర్ల సమ్మయ్య, సమక్క ఇల్లు అగ్ని ప్రమాదంలో కాలిపోయింది.దీంతో బాధిత కుటుంబాన్ని నేతకాని కులసంఘం నాయకులు, లక్ష్మీనర్సింహా దత్తసేన సేవాట్రస్ట్ నిర్వాహకులు పరామర్శించి రూ.4000 నగదు, బియ్యం అందజేశారు. అగ్నిప్రమాదంలో సర్వస్వం కోల్పోయి కట్టు బట్టలతో మిగిలిన బాధిత కుటుంబానికి ప్రభుత్వ ఆర్థిక సాయం అందించి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నేతకాని కులసంఘం నాయకులు కాంతారావు, రాంబాబు, నర్సింహారావు, సందీప్, నాగార్జున, శివప్రసాద్, సతీష్, లక్ష్మినారాయణ, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న గండ్ర వెంకటరమణారెడ్డి.

టేకుమట్ల: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు సత్తా చాటాలని, అందుకు ప్రతీ కార్యకర్త సమష్టిగా పని చేయాలని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని అమ్మ గార్డెన్‌లో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సట్ల రవిగౌడ్ అధ్యక్షతన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో సంక్షేమ పథకాలు ప్రతీ ఒక్కరికి అందాయని, కానీ ప్రస్తుత ప్రభుత్వంలో ఏ ఒక్క పథకం పూర్తి స్థాయిలో లబ్ధిదారులకు అందడం లేదన్నారు. రైతుబంధు, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్ వంటి పథకాలేవి ప్రజలకు చేరడం లేదన్నారు. కరోనా వంటి కష్టకాలంలో సైతం కేసీఆర్ రైతులకు రైతుబంధు ఇచ్చారని గుర్తు చేశారు. రానున్న రోజుల్లో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం రాబోతుందని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలే అసెంబ్లీ ఎన్నికలకు జీవం పోస్తుంది కావున నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో సర్పంచ్, ఎంపీటీసీలు జెడ్పీటీసీలను బీఆర్ఎస్ కైవసం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి ఆకునూరి తిరుపతి, మాజీ సర్పంచ్, ఎంపీటీసీలు, బందెల నరేష్, ఆది రఘు, నేరేళ్ళ శ్రీనివాస్, పింగిళి వెంకటేశ్వర్‌రెడ్డి, పోతనవేని ఐలయ్య, కొలిపాక రాజయ్య, ఉద్దమారి మహేష్‌యాదవ్, నాయకులు గువ్వాడి లక్ష్మన్, శివ పాల్గొన్నారు.

ముసాయిదా పోలింగ్ కేంద్రాల జాబితా ప్రదర్శన



కాటారం: జాబితాను ప్రదర్శిస్తున్న ఎంపీడీఓ

కాటారం: ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో మండలంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ముసాయిదా పోలింగ్ కేంద్రాల జాబితాను మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రదర్శించారు. జాబితాపై ఈ నెల 13న మండల పరిషత్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అడ్డూరి బాబు తెలిపారు. పార్టీల నాయకులు సమావేశంలో పాల్గొని పోలింగ్ కేంద్రాల జాబితాపై అభ్యంతరాలు తెలుపాలన్నారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు సమావేశంలో పాల్గొనాలని ఎంపీడీఓ కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు షగీర్‌ఖాన్ పాల్గొన్నారు.

పంటల రక్షణకు రైతుల పాట్లు



రైతులు ఏర్పాటు చేసుకున్న గ్రీన్ పరదా

మల్హర్: పంటలను కాపాడుకునేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. యాసంగి సీజన్‌లో పంటల వేసిన నాటి నుంచి రాత్రి, పగలు పడిగాపులుకాస్తున్నారు. మండలంలోని ఇప్పలపల్లి క్రాస్ వద్ద రైతులు సాగు చేసిన వరి పొలాలను దుమ్ము, ధూళి, అడవి పందుల భారీ నుంచి రక్షించుకోవాడని ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారి గుండా నిత్యం బొగ్గు లారీలతో పాటు ఇసుక లారీలు రవాణా సాగుతుంది. దీంతో వెలువడిన దుమ్ము, ధూళి కారణంగా తమ పంటలు కాపాడుకోవడానికి రైతులు పొలం చుట్టూ గ్రీన్ పరదాలతో పాటు, రంగురంగుల చీరలను కట్టారు.

కార్యకర్తల సంక్షేమానికి మంత్రి కృషి

కాటారం: కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న గొప్ప నాయకుడు మంత్రి శ్రీధర్‌బాబు అని సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు తెప్పెల దేవేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని గంగారంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో అయన మాట్లాడారు. మండలంలోని విలాసాగర్‌కు చెందిన మాజీ సర్పంచ్ అందె సత్యనారాయణ ఆత్మహత్యయత్నం చేయడం బాధాకరమన్నారు. ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులు సత్యనారాయణను రెచ్చగొట్టి ఆత్మహత్యయత్నానికి పాల్పడేలా చేశారని ఆరోపించారు. మంత్రి శ్రీధర్‌బాబు ఈ ప్రాంతంలో చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను జీర్ణించుకోలేని పలు పార్టీల నాయకులు ఇలాంటివి సృష్టిస్తూ కాంగ్రెస్ కార్యకర్తలను అయోమయానికి గురి చేస్తున్నారని అన్నారు. సత్యనారాయణ వీడియోలో పేర్కొన్నట్లు మంథని నియోజకవర్గంలో ఏ కాంగ్రెస్ కార్యకర్త బాధపడటం లేదని మంత్రి శ్రీధర్‌బాబు చేస్తున్న అభివృద్ధితో ఎనలేని సంతోషంలో ఉన్నారని అన్నారు.

పరామర్శ

కన్నాయిగూడెం: మండలంలోని బుట్టాయిగూడెం గ్రామానికి చెందిన ఆశరెల్లి సత్యం భార్య బానక్క ఇటీవల గుండెపోటుతో మృతి చెందింది. మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు మంగళవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. బానక్క చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి.. అండగా ఉంటామని భరోసా కల్పించారు. బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడు అండగా నిలబడుతుందని జిల్లా నాయకులు కావిరి చిన్నికృష్ణ తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ మాజీ డైరెక్టర్ కొండగొర్ల వెంకటయ్య, సూర్యరావు, సత్యం సమ్మయ్య దుర్గారావు, పోలయ్య, బిల్లం శ్రీనువాస్, జనగం వెంకటయ్య, కుమ్మరి బాబు, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ర్యాంప్ పరిశీలన

వెంకటాపురం(కె): మండల పరిధిలోని చొక్కాల ఇసుక ర్యాంపును ఆర్డీఓ వెంకటేశ్, టీఎస్ఎండీసీ పీఓ శ్రీకాంత్, ఏఎస్పీ శివం ఉపాధ్యాయ మంగళవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ర్యాంప్‌నకు ఇచ్చిన అనుమతులు, తవ్వకాలు చేస్తున్న ప్రాంతాలను పరిశీలించారు. నిర్వాహకులకు తగిన సూచనలు చేశారు. గోదావరిలో ఇసుక తవ్వకాలు చేపట్టి ఒడ్డుకు తరలించేందుకు కాల పరిమితి గడిచిపోవడంతో ప్రక్రియను నిలిపివేయాలని ఆదేశించారు. నిబంధనలు అతిక్రమిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మంగపేట: మండలంలోని రాజుపేట, కత్తిగూడెం సొసైటీ ఇసుక క్వారీలను ఏటూరునాగారం ఏఎస్పీ శివం, రెవెన్యూ డివిజినల్ అధికారి ఎస్.వెంకటేష్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా క్వారీ నిర్వహణ రికార్డులను పరిశీలించారు. ఇసుక క్వారీల నిర్వాహణలో ప్రభుత్వ నిబంధనలు కచ్చితంగా పాటించాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ తోట రవిందర్, టిఎస్ ఎండీసీ పీఓ శ్రీకాంత్, ఆర్ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.